అమ్మకడుపు చల్లగా...

– గొల్లపూడి మారుతీరావు

(గత సంచిక తరువాయి)

మళ్ళీ విషయానికొస్తే – ఈ కథా చర్చలు జరిగే రోజుల్లోనే నవభారత్ పిక్చర్స్ బానర్ 'రైతు కుటుంబం' సినిమాకి కథ, మాటలు రాస్తున్నాను. అక్కినేని హీరో. తాతినేని రామారావు దర్శకుడు. మిత్రులు అట్లూరి పూర్ణచంద్రరావు, నవభారత్ ప్రకాశరావు, పియేపీ మేనేజరు సుబ్బారావుగారు నిర్మాతలు. (పి.ఏ.పి సంస్థ ప్రొప్రయిటర్ కూడా సుబ్బారావుగారే. అందుకే ఈయన్ని 'మేనేజరు సుబ్బారావుగార'నడమే ఆనవాయితీ అయిపోయింది.)

ఉద్యోగాన్ని నామమాత్రంగా మిగిల్చి, సినిమా వ్యాసంగం మీద పూర్తిగా నిలదొక్కుకున్న దశ ఇది. ఓసారి ఉన్నట్టుండి నవయుగ ఫిలింస్ జి.డి ప్రసాదరావుగారు (నటులు, మిత్రులు నారాయణరావు తండ్రిగారు), మద్రాసు వచ్చారు. వారు నిర్మిస్తున్న కథకు అక్కినేనిగారే హీరో. అక్కినేని వారి కథ (ఆత్మీయులు) విని ఆ కథకీ రైతుకుటుంబం కథకీ చిన్న పోలికలున్నాయని అన్నారట.

"ఒక్కసారి మారుతిరావుగారిని అడిగి తెలుసుకోండి" అని చెప్పారట.

'ఆత్మీయులు' కథని దుక్కిపాటి మధుసూధనరావుగారు సిద్ధం చేశారు. అప్పటికి హైదరాబాదులో 'ఆత్మీయులు' షూటింగ్ జరుగుతోంది. ప్రసాదరావుగారు అప్పటికప్పుడు నన్ను హైదరాబాదు తీసుకొచ్చారు. సరాసరి సారధీ స్టూడియోలో దుక్కిపాటి గదికి తీసుకెళ్ళారు. అది నా పాతబడి. ఇద్దరం కలిసి కూర్చుని రెండు కథల్ని పోల్చుకున్నాం. సౌమ్యం ఉన్నదని అనిపించిన చోట ఎలా మార్పులు చేయాలో చర్చించుకున్నాం. ఆ రాత్రి అంతా అదే పని. మళ్ళీ తెల్లవారు ఝామునే మద్రాసు ప్రయాణం.

మద్రాసు ఎయిర్‌పోర్టులోనే పుండరీకాక్షయ్యగారు, బలరాం కలిశారు. ఎన్టీఆర్ పనిమీద హైదరాబాదు వెళ్తున్నారు. "ఎన్టీఆర్ మీ గురించి రెండుమూడుసార్లు అడిగారు. మీ కథలు వింటానన్నారు. వారి పనిమీద వెళ్తున్నాం. బాబు(బలరాంగారి అబ్బాయి) మిమ్మల్ని ఆయన దగ్గరికి తీసుకు వెళ్తాడు. వినిపించండి" అన్నారు.

ఉదయం 3గంటలకే పూజకి సిద్ధంగా ఉన్నట్టు స్నానం ముగించుకుని నుదుటిన బొట్టు పెట్టుకుని పెద్ద గ్లాసుతో టీ తాగి, పట్టుపంచెతో గదిలో కూర్చుని ఉంటారు ఎన్టీఆర్. వారితో ఆ సమయంలో టీని, మాటల్ని పంచుకునే వ్యక్తి ఒక్కరే – వారి శ్రీమతి బసవతారకంగారు. బహుశా ఆ ఒక్క సమయంలోనే ఆయనతో ముచ్చటించే వ్యవధి ఆమెకి దొరుకుతుందేమో. మేం రాగానే ఆవిడ వెళ్ళిపోతారు. గదిలో ఊదొత్తుల వాసనా, గోడకి తల్లిదండ్రుల ఫొటో, గదినిండా వారి షీల్డులు, ఎంజీఆర్‌తో కలిసి నిలబడిన ఫోటో. టేబుల్ మీద స్క్రిప్టులూ, ఫైళ్ళూ.

మూడు గంటలకే ఆయన దినచర్య ప్రారంభమయిపోతుంది. అలా ఎన్ని రోజులు, ఎన్ని గంటలు గడిచాయో! ఎన్ని కథలు, ఎన్ని చర్చలు – ఆ గదిలో సాగాయో! దాదాపు 5గంటలకి వంటవాడు వస్తాడు. ఏమి వంట చెయ్యాలో క్లుప్తంగా వివరిస్తారు. ఆరుగంటలకి మేకప్‌మాన్ పీతాంబరం వస్తారు. ఆ రోజు పౌరాణికమయితే ముందుగానే మేకప్‌కి కూర్చుంటారు. మేకప్ అయే సమయానికి తిరుపతి భక్తుల బస్సులు వస్తాయి. అదొక తిరణాల. విసుగు లేకుండా ప్రసన్నంగా బయటికి వచ్చి అందరినీ పలకరిస్తారు. ఒక్కొసారి నన్నో, భీంసింగు గారినో ఎవరుంటే వారిని పరిచయం చేస్తారు. వీరందరితో ఈ విధంగా కాలం ఎందుకు వృథా చేస్తారా అని మేం నవ్వుకునేవాళ్ళం. ఓపికగా వాళ్ళ పిచ్చి ప్రశ్నలకు సమాధానం చెప్పి, "పేరు పెట్టండి" అంటూ కాళ్ళమీద పడేసే పిల్లలకి పేర్లు పెట్టి, ఊళ్ళో పంటల గురించీ, వర్షాల గురించీ వాకబు చేసేవారు. కాని అడిగేవాళ్ళకీ ఆయనకీ మధ్య ఉన్నది పిచ్చి సంబంధం కాదని తర్వాత మాకర్థమయింది. ఏనాడూ రాజకీయాలతో ప్రమేయం లేని ఆయన ఎన్నికలలో నిలిస్తే బేషరతుగా ఆయన్ని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు – ఆంధ్రప్రదేశ్‌లో చిన్నా పెద్దా అందరు అభిమానులు కలిసి.

ఏడుగంటలకి భోజనం. సాధ్యమయితే షూటింగుకి బయలుదేరే ముందు చిన్న నిద్ర. ఆయన అదృష్టం కళ్ళు మూసుకుంటే నిద్రపోయేవారు. షాట్ షాట్‌కీ మధ్య నిద్రపోయి – మళ్ళీ తరగని ఉత్సాహంతో షాట్‌కి సిద్ధం కావడం ఆయనకే చెల్లు. వారితో కథ చెప్పి, చర్చ జరిపి బయటికి వచ్చేసరికి ఇంకా తెల్లవారడానికి గంట వ్యవధి ఉండేది. 'చిరంజీవి' శబ్దం ఆయనకి వర్తించినట్టు ఎవరికీ వర్తించదేమో. నూరేళ్ళు జీవించడమంటే కాలెండరు సంవత్సరాలు గడపడం కాదు. కాలాన్ని సార్థకం చేసుకోవడం – ఆయనలాగ.

మర్నాడే 'వారాల అబ్బాయి' కథని ఎన్టీఆర్‌కి చెప్పాను. తర్వాత రోజు వెళ్ళి క్లైమ్ ఇతివృత్తం చెప్పాను. విచిత్రం ఆయన్ని రెండో కథ ఎక్కువగా ఆకర్షించింది. పుండరీకాక్షయ్యగారు ఆయన్ని కలిసినప్పుడు "మారుతిరావుగారు ఏక్షన్ సబ్జెక్టు అంత బాగా చెప్తారనుకోలేదు" అన్నారట. నన్ను పుండరీకాక్షయ్యగారు ఆయన దగ్గరికి తీసుకువెళ్ళారు. "నాతో ఔట్‌డోర్‌కి రాకూడదా. తీరికగా మాట్లాడుకోవచ్చు" అన్నారు.

మధ్యాహ్నం పుండరీకాక్షయ్యగారు, బలరాం నేనూ ఔట్‌డోర్‌కి బయలుదేరాం. ఎయిర్‌పోర్టు సమీపంలోనే ఎన్టీఆర్ కారు ఎదురయింది. ఆయన కారులోకి మారాం.

నన్ను తీసుకెళ్ళి శ్రీకృష్ణ సత్య సెట్ చూపించారు. వారితో కలిసి జి.ఎన్ చెట్టి రోడ్డులో నర్సింగ్ హోంలో ఉన్న పింగళి నాగేంద్రరావుగారిని చూడడానికి వెళ్ళాం. ఆయన కాన్సర్‌తో బాధపడుతున్నారు. పింగళిగారిని చూడడం అదే మొదటిసారీ, ఆఖరు సారీను.

ఎన్టీఆర్‌కి క్రైమ్ కథ నచ్చింది. పుండరీకాక్షయ్యగారి సొంత బానర్ ఈ సినిమాతో ప్రారంభం. అందుకని వడపోత నిశితంగా సాగింది. రెండు కథలూ త్రివిక్రమరావుగారికి చెప్పమన్నారు. ఆయనప్పుడు విజయవాడలో "కళ్యాణచక్రవర్తి" థియేటర్ కట్టించే పనిలో ఉన్నారు. వెళ్ళి అక్కడ రెండు కథలూ చెప్పాను. వారికి 'వారాలబ్బాయి' (కుటుంబగాథ) నచ్చింది.

అయితే కథ నచ్చడానికి, సినిమా నిర్మాణం ప్రారంభం కావడానికి చాలా దూరమూ, చాలా కారణాలూ ఉండవచ్చు. అప్పట్లో ఆ ప్రయత్నం అక్కడే ఆగిన గుర్తు.

🦋🦋🦋

నేను విజయవాడలో పనిచేసే రోజుల్లోనే ఒకసారి ఆఫీసుకి వచ్చేసరికి నాకోసం ఎదురు చూస్తూ ఒకాయన నిలబడి ఉన్నారు. ఆయన్ని చూస్తూనే ఏదో తెలిసిన ముఖంలాగ ఉంది అనుకున్నాను. కాస్త మెల్లగా గుర్తుపట్టాను. ఆయన సినీనటుడు బాలయ్య. ఒక కథ నాకు చెప్పమని నవయుగ పిక్చర్స్ పర్వతనేని చంద్రశేఖరరావుగారు పంపించారు. అప్పటికప్పుడు స్టూడియోలో కూర్చుని ఆయన చెప్పిన కథ విన్నాను. ఆయన మనస్సులో ఒక 'సూత్రం' ఉంది. ఇతమిద్దమనే స్వరూపం లేదు. సాయంకాలం వెళ్ళి చంద్రశేఖరరావుగారిని కలిశాను. నా మనస్సులో మాటే చెప్పాను. "మీరే సినిమా రాయాలి. దర్శకునిగా విశ్వనాధ్‌గారిని నిర్ణయించమన్నాను" అన్నారాయన. ఆవిధంగా 'చెల్లెలికాపురం' చిత్రకథా చర్చ మద్రాసులో ప్రారంభమయింది. 'ఆత్మగౌరవం' తరువాత విశ్వనాధ్‌గారూ నేనూ కలిసి పనిచేసిన చిత్రం ఇదే.

విశ్వనాధ్‌గారితో కథ చర్చలు – చాలా ఆహ్లాదంగా, ఆనందంగా సాగేవి. సృజనాత్మకమయిన ఆలోచనలతో బంతులాటలాగ ఉండేది. కొత్త ఆలోచనని ఒడిసి పుచ్చుకుని దానికి ఆయన అలంకరణ చేస్తే మనస్సులో ఉన్న ఆలోచనారూపాన్ని బయటకు లాగేవాడిని. మా కథా చర్చలు చూడడానికీ, పాల్గొనడానికీ ఉవ్విళ్ళూరే సహాయదర్శకుల్నీ, సాంకేతిక నిపుణుల్నీ తెలుసు నాకు.

అప్పట్లో ఆయనకో అలవాటు ఉండేది. కిమాంజర్దా కిళ్ళీ నమలడం. మంచి ఆలోచన రూపు దిద్దుకున్నప్పుడల్లా ఆయన ఆనందంలో పొంగిపోతూ ఓ కిళ్ళీ కట్టుకునేవారు. అంతేకాదు. ఒకటి తనే కట్టి నాకిచ్చేవారు. మనస్సుకీ, మౌలికమయిన కృషికీ ముడిపడిన దురలవాటు పీక పట్టుకుంది. మొదట సరదాకీ, తర్వాత ఉత్సాహానికీ వేసిన కిళ్ళీ అటు తర్వాత అలవాటుగా, ఆపైన వ్యసనంగా మారి కూర్చుంది – ఇద్దరికీ.

ఆ కిళ్ళీ దాదాపు 15 సంవత్సరాలు నన్ను ఆనందపరిచి, హింసించి, బాధపెట్టి, వేధించింది. ఒక దశలో ఒకానొక రాత్రి నేనూ విశ్వనాధ్‌గారూ ట్రస్టుపురం మెయిన్ రోడ్డు మీద కనీసం పొగాకు దొరక్క తిరిగి తిరిగి మమ్మల్ని మేం తిట్టుకున్నాం. రోజుకి 20సార్లయినా వేసుకుంటూ, రాత్రీ పగలూ అది లేనిదే గడవని పరిస్థితికి వచ్చేశాను. నా జీవితంలో నేను వదులుకోలేక నరకం అనుభవించిందీ, వదులుకోడానికి శతథా ప్రయత్నించినది, 'వ్యసనం' అని చెప్పుకోవలసినదీ – జర్దా కిళ్ళీ ఒక్కటే.

ఒకసారి నిర్మాత పూర్ణచంద్రరావుగారూ, నేనూ షూటింగు లొకేషన్లు చూడడానికి మైసూరు వెళ్ళాం. మూడురోజుల తర్వాత తెచ్చుకున్న జర్దా సామగ్రి అయిపోయింది. అంతే. గిలగిలలాడిపోయాను. ఇక లొకేషన్ లేదు, ఏమీలేదు, మద్రాసు వెళ్ళాలని పూర్ణచంద్రరావుని తొందరపెట్టేశాను. ఇద్దరం ఉరుకుల మీద బెంగుళూరు ఎయిర్‌పోర్టు చేరాం. అక్కడ దేవుడు లాగ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మాత సుబ్బారావుగారు కనిపించారు. చేతిలో జర్దాసామగ్రి. ఇక ఆనందానికి అవధిలేదు. ప్లేన్ నాలుగు గంటలు లేటు. నలభై గంటలు లేటయినా క్షమించగల ఔదార్యం వచ్చేసింది. కిళ్ళీలు నములుతూ ఆనందంగా గడిపాం.

రాత్రి రచన సాగిస్తూ దాదాపు 11–12 గంటల మధ్య పాండీబజారు ఆంధ్రా కిళ్ళీ షాపుకి నేను, మా ఆవిడని తీసుకుని వచ్చేవాడిని. అప్పుడు తప్పనిసరిగా ఆ టైంలో కనిపించే మిత్రులు సంగీత దర్శకుడు సత్యం. ఆయనా జర్దా కోసమే వచ్చేవాడు. ఆంధ్రా కిళ్ళీ షాపు యజమాని కైలాసంకి మేం పాతకాపులం. ఒకసారి రాత్రి బాగా ఆలస్యమైంది. కైలాసం దుకాణం తుడుచుకుని మూసేస్తున్నాడు. నాకు నిస్సహాయతా, అంతకు మించి కోపం తోసుకొచ్చింది. 50 రూపాయలకి జర్దా డబ్బా, ఇంకా కిమాం సీసా, సున్నం సీసా ఓ కట్ట తమలపాకులు, పక్క పాకెట్ కొన్నాను. అంతా కలిపి 100 దాటింది. అక్కడికక్కడే ఒకే ఒక్క కిళ్ళీ కట్టుకుని ఆ సామగ్రి అంతా ఒక్కడే వదిలేసి ఇంటికి వెళ్ళిపోయాను. కైలాసం బిత్తరపోయి ఉంటాడు. తర్వాత అయిదారు రోజులు అటు వెళ్ళలేదు. ఆ తర్వాత వెళ్ళాను అన్నీ వేసి ఉంచిన సంచీ నాకిచ్చి తన ఇబ్బంది చెప్పుకున్నాడు కైలాసం. తరువాత ఎన్నడూ నన్ను కాదనలేదు.

ఇంకా దయనీయమయిన కాని తలుచుకుంటే నవ్వువచ్చే సందర్భం ఒకటుంది. ఓసారి మద్రాసు నుంచి రైల్లో విశాఖపట్నం వెళ్తున్నాను. విజయవాడలో తెల్లారేసరికి నా దగ్గర జర్దా, వక్క ఉంది కాని ఆకు, సున్నం లేదు.

అప్పటికప్పుడు ప్లాట్‌ఫారం మీద దొరికే వస్తువు కాదు. పిచ్చివాడిలా ప్లాట్‌ఫారం అంతా తిరిగాను. చేతిలో ఆకూ, సున్నం పట్టుకున్న ప్రయాణికుడు కనిపించాడు. నాకు ప్రాణం లేచి వచ్చింది. వెళ్ళి నా కష్టం చెప్పుకుని ఆకు, సున్నం కావాలన్నాను. ఆయన మొహం చాటంతయింది. "అయ్యా, నాకు జర్దా వక్కా కావాలి" అని మొరపెట్టుకున్నాడు. ఇద్దరు నిస్సహాయులమూ కలిసి ప్లాట్‌ఫారం మీదే తాంబూలాల్ని సేవించాం ప్రాణమిత్రుల్ని కలిసినట్టు పలకరించుకుని. ఏలూరులో మళ్ళీ ఒకరినొకరం వెదుక్కున్నాం. రాజమండ్రి వచ్చేసరికి ఆకులు అయిపోయాయి. నా దగ్గర జర్దా, ఆయన దగ్గర సున్నం మిగిలింది. ఇద్దరం 'తంబాకు ' వేసుకుని నాలిక కింద ఉంచుకుని విశాఖపట్నం దాకా ఆనందించాం.

"చెల్లెలి కాపురం" సినిమాకి అసిస్టెంటు డైరెక్టరు డి.యస్.ప్రకాశరావు అనే యువకుడు. మంచి ఉత్సాహి. సమర్థుడు కూడా. కాని చర్చల్లో ఎప్పూడూ పొసగని ఆలోచనే చెప్పి నా చేత తిట్లు తినేవాడు. కాని ఏనాడూ నా తిట్లని మనసుదాకా పోనివ్వని సహృదయుడు. ఆ కంపెనీకి ప్రొడక్షన్ మేనేజర్ కేశన జయరాం. ఎప్పుడూ భుజాన చిన్న టర్కిష్ తువాలు, ముఖం మీద చిరునవ్వు. అందమయిన వ్యక్తి. నటుడు కావాలని వచ్చి మరేదో అయిన చాలామందిలో ఇతనొకడు. ఊరు వెంకటగిరి. మా చర్చల్లో అప్పుడప్పుడు దూరి ఏదో తనకు తోచిన ఆలోచన చెప్పేవాడు. నేను విసుక్కుని "జయరాం. ఈ కంపెనీలో నీ పని కార్లూ, పెట్రోలూ చూడడం. ఆ పని చెయ్. కథ గురించి మేం ఆలోచిస్తాం. ఎప్పుడయినా నువ్వు సినిమా తీసినప్పుడు. నీ కొత్త ఆలోచనలు చెపుదువుగాని" అనేవాడిని నిష్కారంగా. జయరాం నవ్వుకుని వెళ్ళిపోయేవాడు – ఏమీ బాధపడకుండా.

అయితే అక్షరాలా ఆ పనే చేశాడు జయరాం. నిర్మాత అయి సినిమా తీశాడు. ఎప్పుడో కాదు. చెల్లెలి కాపురం అవుతూనే చేశాడు. ఎవరితోనో కాదు. నన్నే రచయితగా పెట్టుకున్నాడు. కథ నేనే చెప్పాను. దర్శకుడు ఎవరోకాదు. డి.యస్.ప్రకాశరావు. ఏతావాతా సినిమా పరిశ్రమలో నేను నేర్చుకున్న మొదటి పాఠం అప్పుడే. ఎవరినీ ఏ సందర్భంలోనూ చిన్నచూపు చూడడానికి వీలులేదు. సినీరంగంలో ఎవరి అదృష్టం ఏమిటో, ఎవరి శక్తి సామర్థ్యాలు ఎంతటివో చెప్పతరంకాదు.

నటీమణి వాణిశ్రీ నెల్లూరి వాస్తవ్యురాలు. జయరాంకి చాలా సన్నిహితురాలు. తొలి దినాలలో ఆమెను ఆదుకున్న వ్యక్తి జయరాం. ఆ కృతజ్ఞతతోననుకుంటాను. ఓ చిత్రం చెయ్యడానికి అంగీకరించింది.

సినీరంగంలో సినిమా తీయడానికి డబ్బుకంటే కావలసిన ముడిసరుకు ఒకటుంది. దాని పేరు అనుభవం. కోట్లు తెచ్చి పెట్టుబడి పెట్టిన వాళ్ళు పైసా మిగలక రోడ్డు మీద పడిన సందర్భాలు తెలుసు. చేతిలో పైసా లేనివారు అద్భుతమయిన చిత్రాల నిర్మాతలుగా స్థిరపడడం నాకు తెలుసు. ఎప్పుడు ఏ దశలో దేని అవసరం ఉందో తెలిసిన ఒకే ఒక

డిపార్టుమెంటు – ప్రొడక్షను. సినీరంగంలో బొంబాయిలోనూ, మద్రాసులోనూ చాలామంది గొప్ప నిర్మాతలు మొదట్లో ప్రొడక్షను చూసినవారు.

ఉదాహరణకి – అట్లూరి పూర్ణచంద్రరావు, వై.వి.రావు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, మేనేజరు సుబ్బారావు (ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్), కేశన జాయరాం, కె.యస్.రామారావు – ఇలా ఎంతమందయినా ఉన్నారు. ఒకనాడు అద్భుతమయిన చిత్రాలు నిర్మించి, అభిరుచికీ, అభినివేశానికీ పెద్దపీట వేసిన నిర్మాత – కె.మురారి నవయుగ సంస్థ అధిపతులలో ఒకరి అబ్బాయి. ఆయన నా దగ్గర, దుక్కిపాటి దగ్గర ప్రొడక్షన్ విషయాలు నేర్చుకోడానికి మెడిసిన్ చదువు మానేసి వచ్చాడు. మా యిద్దరిచేత చాలాసార్లు తిట్లు తిన్నాడు. అయితే ఆత్మగౌరం కంటె జిజ్ఞాసకి పెద్దపీట వేసిన దశ అది. మంచి అభిరుచి గల నిర్మాతగా తనని తాను తీర్చిదిద్దుకున్నాడు.

చదివి కాదు. ఎవరో చెప్పగా విని గుల్షన్ నందా నవల 'కటీపతంగ్" ఆధారంగా నా సహజ ధోరణిలో ఓ కథ అల్లుకున్నాను. ఆ కథ జయరాంకీ, ప్రకాశరావుకీ నచ్చింది. ఓ రోజు నన్ను తీసుకెళ్ళి వాణిశ్రీకి కథ చెప్పించారు. ఆమెకీ నచ్చింది. అంతే. కొత్త సినిమా పట్టాలు ఎక్కింది. ఆ రోజుల్లో వాణిశ్రీకి హీరోలకి ఉండే గ్లామరు ఉండేది.

అయితే వచ్చిన చిక్కు – అప్పుడే నాకు శంబల్పూరు బదిలీ అయింది. ఇద్దరికీ చెప్పాను – 1500 మైళ్ళదూరం వెళ్తున్నాను. కథ తీసుకుని, మరెవరి చేతనయినా రాయించుకోండని. నాకు బాగా జ్ఞాపకం. ఓ రాత్రి పది గంటల సమయంలో పాండీ బజారు హమీదియా రెస్టారెంటు బయట ఇద్దరూ నా కాళ్ళు పట్టేసుకున్నారు. "గురువుగారూ, మీరే రాయాలి" అంటూ. అంతేకాదు. కథా చర్చలకి శంబల్పూరు వస్తామన్నారు. నాకోసం 1500 మైళ్ళు వచ్చి, రెండు వారలుండి – స్క్రిప్టు సిద్ధం చేసుకుని వెళ్ళిన ఒకే ఒక్క నిర్మాత జయరాం అయితే, శంబల్పూరు రోజుల్లో నా చేత సినిమా 'పాపం పసివాడు ' రాయించిన నిర్మాత పూర్ణచంద్రరావు.

జయరాం తీసిన చిత్రం 'మరుపురాని తల్లి' – ఆనాడు అంతా తెల్లబోయి చూసేంత గొప్పది. కృష్ణ, వాణిశ్రీ, బాలయ్య, అల్లురామలింగయ్య, రమాప్రభ, గుమ్మడి, పండరీబాయి, కె.వి.చలం. నటీనటులు. సినిమా పెద్ద హిట్టయి శతదినోత్సవం చేసుకుంది.

కార్యరూపం దాల్చినవి. దాల్చనివి – రకరకాల దశలలో ఉన్న సినిమా పనులమీద అనునిత్యం విజయవాడ మద్రాసుల మధ్య తిరగడం మామూలయిపోయింది. నెల్లో ఎక్కువ రోజులు ప్రయాణంలో గడిచిపోయేవి. శలవులు, డ్యూటీ సవరణలు ఎలా జరుపుకునేవాడినో భగవంతుడికే ఎరుక.

ఓ రోజు రాత్రి ప్రముఖ పాత్రికేయులు. అమెరికన్ దౌత్య కార్యాలయంలో 'అమెరికన్ రిపోర్టరు' సంపాదకులుగా ఉన్న బియెస్సార్ కృష్ణగారు నా గదికి వచ్చారు. ఉన్నట్టుండి "మద్రాసులో మీకు ఉద్యోగం కావాలా?" అన్నారు.

తుళ్ళిపడ్డాను. అవునన్నాను.

"ఓకె. మీకు నాలుగంకెల జీతంతో ఉద్యోగాన్ని నేను ఏర్పాటు చేస్తాను. జరిగేవరకూ ఎవరికీ చెప్పకండి" అనేసి వెళ్ళిపోయారు. ఈ సంఘటన నవంబరులో జరిగితే మరో నాలుగు నెలల తర్వాత నేనూ బియెస్సార్ పానగల్ పార్కులో ఓ సాయంకాలం కూర్చున్నాం. కొన్ని వందలసార్లు పానగల్ పార్కు చుట్టూ ప్రయాణం చేసినా అప్పటికీ ఇప్పటికీ ఆ పార్కులోకి వెళ్ళడం అదొక్కసారే జరిగింది. నాకు నెలకి వెయ్యి రూపాయల జీతంతో అమెరికా దౌత్యకార్యాలయంలో అమెరికన్ రిపోర్టరు పత్రికా విభాగంలో ఉద్యోగం ఉందన్నారు. అయితే రోజుకి 8 గంటల పని. మిగతా పనులకీ, తిరుగుళ్ళకీ ఆస్కారం ఉండదు. కాగా యాజమాన్యం అభ్యంతరం ఉంటుంది. ఉద్యోగం బంగారమే. కాని ఆ దశలో నాకు మద్రాసులో ఉండటానికి ఒక ఆధారం కావాలి గాని మద్రాసులో ఉండటమే లక్ష్యం కాదు. ఉంటూ సినిమా పని సాగించాలన్నది లక్ష్యం. నిర్ణయానికి వారం రోజులు టైమడిగాను. గడువు తర్వాత "ఈ ఉద్యోగం వద్దులెండి.నా దృష్టి మద్రాసులో సినీరంగం పైనే గాని మద్రాసులో ఉద్యోగం మీద కాదు" అన్నాను బియెస్సార్‌తో. ఆయనా అర్థం చేసుకుని నా ఆలోచననే సమర్థించారు.

నేను కాదన్నాక ఆ ఉద్యోగాన్ని కొన్నాళ్ళు ప్రముఖ పాత్రికేయుడు బంగొరే చేశారు. ఆ తర్వాత ఏమయిందో తెలియదు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments